క్లుప్తంగా

ఘనంగా పాడ్యమి పూజలు



వెంగాపురం రామాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

బలిజిపేట: కార్తీకమాసం పూర్తికావడంతో పోలి పాడ్యమి పూజలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సోమవారం తెల్లవారుజామున చెరువులు, కాలువల్లో కార్తీక దీపాలు వెలిగించి కార్తీకమాసానికి వీడ్కోలు పలికారు. పోలిపాడ్యమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల అన్నసమారాధనలు చేపట్టారు.

సచివాలయాల్లో ఖాళీలు భర్తీ చేయండి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న సన్యాసిరావు, తదితరులు

పార్వతీపురంటౌన్: ఖాళీగా ఉన్న గ్రామ/వార్డు సచివాలయ పోస్టులను భర్తీ చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో మేనేజర్ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని 13వ సచివాలయంలో ఖాళీగా ఉన్న రెవెన్యూ సెక్రటరీ(వీఆర్ఓ), రెగ్యులేషన్ సెక్రటరీ(డబ్ల్యూపీఆర్ఎస్) పోస్టులను భర్తీచేయాలని కోరారు. ముఖ్యమైన సెక్రటరీ పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలకు సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు స్పందన కరువు



పబ్లిక్ గ్రీవెన్స్ హాల్‌లో ఖాళీగా ఉన్న కుర్చీలు

సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి స్పందన కరువైంది. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మండల పరిషత్‌లో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్‌లో అర్జీలు అందించాలని అధికారులు కోరినప్పటికీ ప్రజలు ఎవరూ స్పందించలేదు. గతంలో ఇచ్చిన వినతులనే ఇంతవరకు పరిష్కరించకపోవడంతో పబ్లిక్ గ్రీవెన్స్‌పై ప్రజలకు నమ్మకం కొరవడింది. ఎంపీడీఓ పి.త్రివిక్రమరావుతో పాటు వివిధ శాఖల అధికారులు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీదారుల కోసం ఎదురు చూశారు. ఎవరూ రాకపోవడంతో తమ రోజువారీ విధుల్లో నిమగ్నమయ్యారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

సాలూరు: మున్సిపాలిటి పరిధిలో పన్నుల వసూలు వేగవంతం చేయాలని కమిషనర్ సత్యనారాయణ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సచివాలయ ఎమినిటీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పట్టణ పరిధిలో వివిధ రకాల పన్ను బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోయాయని, వాటి వాసూళ్లపై సిబ్బంది దృష్టి సారించాలని సూచించారు. బకాయిలు చెల్లించని వారిపై కేసులు నమోదు చేయించాలన్నారు. పన్ను వసూలులో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్యాస్ లీక్: స్వల్ప ఆస్తి నష్టం



ఎగసిపడుతున్న మంటలు

జియ్యమ్మవలస: మండలంలోని చిన మేరంగి గ్రామంలో ఉన్న ప్రతాపరుద్ర కాలనీలో గొట్టిపల్లి ముత్యాలమ్మ ఇంట్లో గ్యాస్ లీక్ అయి స్వల్ప ఆస్తినష్టం సంభవించినట్లు ఎస్ఐ అనీష్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంటి యజమానురాలైన ముత్యాలమ్మ వంట చేసేందుకు ఇంట్లోని గ్యాస్ వెలిగించగా, ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో భయంతో ఆమె బయటకు పరుగులు తీసింది. స్థానికులు అప్రమత్తమై జరిగిన ఘటనపై ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. కొంతమేర ఆస్తినష్టం జరిగినట్లు సమాచారం.

అదనపు దోపిడీ



కళ్లాల్లో తూకాలు వేస్తున్న ధాన్యం బస్తాలు

- రైతులను దోచుకుంటున్న దళారులు
- క్వింటాకు 5కిలోలు చొప్పున అదనంగా సేకరణ
- చోద్యం చూస్తున్న అధికారులు

మండలంలో రైస్ మిల్లులు	20
బ్యాంక్ గ్యారంటీలు తీసినవి	20
ఇప్పటివరకు ఇచ్చిన ట్రక్‌షీట్లు	717
కొనుగోలు చేసిన ధాన్యం	6,345 మెట్రిక్ టన్నులు



మిల్లులకు తరలిస్తున్న ధాన్యం

బలిజిపేట: అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటకు గిట్టుబాటు ధర పొందలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ అక్కడి సిబ్బంది నిర్లక్ష్యం దళారులకు కాసులు కురిపిస్తోంది. నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రం సిబ్బంది నేరుగా రైతుల కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యంలో తేమ శాతం, నాణ్యతను పరీక్షించి కొనుగోలు చేయాల్సి ఉంది. ధాన్యం తూకం వేసి ట్రాక్‌షీట్ కేటాయించి ఎంపిక చేసిన మిల్లులకు తరలించాల్సి ఉంది. అయితే కొనుగోలు కేంద్రం సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లకపోవడంతో దళారులే రైతుల వద్దకు వెళ్లి ధాన్యం సేకరిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువకే కొనుగోలు చేయడంతో పాటు క్వింటాకు అదనంగా 5 కిలోలు చొప్పున తూకం వేస్తూ రైతులను దోచుకుంటున్నారు. 80 కిలోల బస్తాకు 4 కిలోలు, 40 కిలోల బస్తాకు 2 కిలోలు చొప్పున అదనంగా తీసుకుంటున్నారు. ఇలా అయితేనే ధాన్యం తరలిస్తామని తెగేసి చెప్పడంతో చేసేదిలేక రైతులు అదనపు ధాన్యాన్ని సమర్పించుకోవాల్సి వస్తోంది.

చేసేది లేకే..

క్వింటాకు 5 కేజీలు అదనంగా తూకం వేస్తున్నారు. 40 కేజీల బస్తాకు అయితే 2 కిలోలు, 80 కేజీల బస్తాకు అయితే 4కిలోలు చొప్పున అదనంగా తీసుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు ధాన్యం విక్రయిస్తున్నాం.

– అప్పలస్వామి, రైతు, వెంగళరాయపురం, బలిజిపేట మండలం

మాదృష్టికి రాలేదు

క్వింటాకు 5 కిలోల వంతున అదనంగా ధాన్యం తీసుకుంటున్నట్టు మాదృష్టికి రాలేదు. ఎవరికీ అదనంగా ధాన్యం ఇవ్వొద్దని చెపుతున్నాం. తూకంలో అదనంగా ధాన్యం తీసుకుంటే చర్యలు తీసుకుంటామని మిల్లర్లను హెచ్చరించాం.

– రమేష్‌బాబు, సీఎస్‌డీటీ, బలిజిపేట

రైతులే నేరుగా మిల్లులకు తరలించినా.. అక్కడ కూడా అదనంగా ధాన్యం తూకం వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో రవాణా, హమాలీ చార్జీలను కూడా రైతులే చెల్లించాల్సి వస్తోంది. దీని వల్ల 80 కిలోల బస్తాకు రూ.120 నుంచి రూ.130 వరకు నష్టపోవాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. దీనికితోడు విక్రయించిన ధాన్యానికి ట్రాక్‌షీట్లు తెగి డబ్బులు ఖాతాలో జమ అయ్యేందుకు చాలా సమయం పడుతోందని అంటున్నారు. చేసేది లేక లాభనష్టాలను పక్కన పెట్టేసి దళారీలకే ధాన్యం విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల సిబ్బంది ధాన్యం సేకరణలో చిత్తశుద్ధితో పనిచేస్తే రైతులకు మద్దతు ధరతో పాటు మేలు జరుగుతుంది.

మహిళల్లో రక్తహీనత నివారణపై దృష్టి

సీతానగరం: మహిళల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పీహెచ్‌సీ వైద్యులు ఉష, పావని తెలిపారు. రక్తహీనతతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి అవసరమైన వైద్య పరీక్షలు, మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. పీహెచ్‌సీలో సోమవారం వారు మాట్లాడుతూ.. విద్యార్థినులు, గర్భిణుల్లో ఎక్కువ మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు వైద్య పరీక్షల్లో గుర్తించామన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ మందులు, విద్యార్థినులకు ఐరన్ మాత్రలు, ఫోలిక్ యాసిడ్ మందులు అందివ్వడం జరుగుతుందన్నారు.

హిమోగ్లోబిన్ శాతం పెరిగే వరకు సిబ్బంది సహకారంతో వైద్య సేవలు అందిస్తామన్నారు. ఐరన్ లోపం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ సూచనల మేరకు విద్యార్థినులు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ



పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో ప్రచారంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

పార్వతీపురం: రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని సెంట్రల్ ఆఫీస్ బేరర్(సీఓబీ) బీవీ రమణ అన్నారు. పార్వతీపురం, గుమడ స్టేషన్ల పరిధిలో సోమవారం యూనియన్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. స్టేషన్, గేట్, ఇంజినీరింగ్, రైల్వే కార్మికులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 4,5,6 తేదీల్లో యూనియన్ ఎన్నికలు జరుగుతాయన్నారు.

ఈ ఎన్నికల్లో ఈస్టుకోస్టు ఆర్ఎస్‌యూ తరఫున పోటీ చేస్తున్నట్లు చెప్పారు. కార్మికులంతా సంపూర్ణ మద్దతును అందించి ఎకో ఆర్ఎస్‌యూ అభ్యర్థులకు మద్దతు తెలపాలని అభ్యర్థించారు. ఆయనతో పాటు సీఓవీ వీవీ రమణ, బొబ్బిలి బ్రాంచ్ సెక్రటరీ రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.రమేష్ తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం.రాజేష్ సూచించారు. మండలంలోని కాశీపేట జంక్షన్ వద్ద సోమవారం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, రోడ్డు భద్రత నిబంధనలపై ప్రజలక అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసైతే ఆరోగ్యం పాడువుతుందని, ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతారని, కుటుంబాలు రోడ్డున పడతాయని, జీవితాలు నాశనమవుతాయన్నారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయని, కావున అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్ నంబరు, ఓటీపీ వివరాలు తెలియజేయొద్దని, తెలియని నంబర్ల నుంచి మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను తెరవొద్దని సూచించారు. వాహన చోదకులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇస్తే వారి తల్లిదండ్రులతో పాటు వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా..!

వీరఘట్టం:

మూడేళ్ల కిందట చేపట్టిన వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా జంక్షన్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అధికారులు తొలగించారు. అయితే ఈ పనులు పూర్తయి ఏడు నెలలు కావస్తున్నా ఇంతవరకు విగ్రహాన్ని మెయిన్ రోడ్డులో ప్రతిష్ఠించకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాన్ని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న తుప్పల్లో నిర్లక్ష్యంగా వదిలేశారని కేవీపీఎస్ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు విగ్రహాన్ని వీరు సోమవారం పరిశీలించారు. వెంటనే విగ్రహాన్ని జంక్షన్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఎన్.సింహాచలం, కె.సింహాచలం, ప్రసాదరావు, తదితరులు కోరారు.



తుప్పల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఓపీఎస్ సాధన మహాసభను విజయవంతం చేయాలి



ఏపీసీపీఎస్ఈఏ అదనపు కార్యదర్శి శ్రీనివాసరావు

సీతానగరం: అధికారంలోకి వచ్చిన వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీని ఇంతవరకు అమలు చేయనందుకు నిరసనగా విజయవాడలో ఈ నెల 10న నిర్వహించే మహాసభలో ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అదనపు కార్యదర్శి గురాన శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని గుచ్చిమిలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం నిరాశా నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్న సీపీఎస్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం వచ్చి 5 నెలలు గడిచినా ఇంతవరకు ఉద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 10న సీపీఎస్ ఉద్యోగులు చలో విజయవాడ కార్యక్రమం, మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మంత్రి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రెడ్డి వేణు

పార్వతీపురంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వ్యాఖ్యలు, ప్రకటన బాధ్యత రాహిత్యం, అర్థరహితంగా ఉన్నాయని పలు పార్టీలు, ప్రజాసంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ మేరకు గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సోమవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఎం నాయకులు రెడ్డి వేణు మాట్లాడుతూ.. పోరాటాల వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని మంత్రి వ్యాఖ్యలు చేయడం అర్థరహితమన్నారు. మంత్రి తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీరు, మీపార్టీ ఎన్నికల ముందు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే పోరాటాల అవసరం రాదని హితవు పలికారు. గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తెలివైన వారని ఒకసారి, అర్హులు కారని ఒకసారి అవగాహన లేకుండా మాట్లాడం మానుకోవాలని సూచించారు. తక్షణం గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల, అధ్యాపకుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని, లేదంటే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కూరంగి మన్మథరావు, తోట జీవ, పీసీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, లిబరేషన్ నాయకులు బొత్స నర్సింగరావు, పి.సంఘం, రైతు కూలీ సంఘం నాయకులు పి.శ్రీనునాయుడు, సీఐటీయూ నాయకులు గొర్లి వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి గంగునాయుడు, మండంగి సూరయ్య, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, శ్రామిక మహిళా సంఘం నాయకులు వాకాడ ఇందిర, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రహదారి గోతులు పూడ్చేదెప్పుడు?



నారాయణపురం రోడ్డులో ఉన్న గోతులు



బస్టాండ్ వద్ద రోడ్డుపై భారీ గుంత

బలిజిపేట: బలిజిపేట బస్టాండు రోడ్డు గోతులమయంగా మారింది. ఈ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌కు వెళ్లివచ్చే వారితో పాటు పక్కనే ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, రోడ్డు పక్కన ఉన్న దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులతో ఈ రోడ్డులో నిత్యం జనసంచారం ఎక్కువగా ఉంటుంది. ఇరుకు రోడ్డు కావడం, ఆపై గోతులతో నిండిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరడంతో వాహన చోదకులు వాటిని గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. బొబ్బిలి, రాజాం వైపు నుంచి బస్సులు బస్టాండ్‌కు వచ్చే సమయంలో వాహనాల రాకపోకలకు అవకాశం ఉండదు. రాత్రి సమయాల్లో గోతులు కనిపించక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి బస్టాండ్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలకు కోరుతున్నారు.

అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలి



ఎస్ఐలకు సూచనలిస్తున్న సీఐ హరి

గుమ్మలక్ష్మీపురం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంకల్పం పేరిట గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఎల్విన్‌పేట సీఐ బి.హరి సూచించారు. మండల పరిధిలోని ఎల్విన్‌పేట సర్కిల్ కార్యాలయంలో కురుపాం, నీలకంఠాపురం ఎస్ఐలు పి.నారాయణరావు, నీలకంఠారావులతో సోమవారం సమావేశమైన ఆయన.. సంకల్పం పేరుతో గ్రామాల్లోని ప్రజలకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, రోడ్డు భద్రతా నియమాలపై కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలపై ఆరాతీశారు. ప్రజల్లో మంచి మార్పును ఆశించి చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే డ్రాప్ బాక్సుల్లో విద్యార్థుల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించవచ్చన్నారు. ముఖ్యంగా గంజాయి, కొకైన్, హెరాయిన్, గుట్కా, ఖైనీ, సారా వంటి మత్తు పదార్థాలతో పాటు మద్యం అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే..

ఆస్పత్రుల అభివృద్ధి

- వైద్యరంగానికి గత ప్రభుత్వం పెద్దపీట
- నాడు–నేడు కింద ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన
- రాజన్నదొర చొరవతో నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రి
- ఎన్నికల నాటికి తుది దశకు చేరుకున్న పనులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ముందుకు సాగని వైనం



తుదిదశకు చేరుకున్న వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం

సాలూరు: శిథిలావస్థకు చేరిన ఆస్పత్రి భవనాలు, వైద్య పరికరాల కొరత, అరకొర వైద్య సిబ్బంది.. ఇదీ 2014–19 మధ్య టీడీపీ పాలనలో ప్రభుత్వ ఆస్పత్రుల దుస్థితి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వాస్పత్రులు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా రూపుదిద్దుకున్నాయి. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల్లో అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించారు. పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించడంతో అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చారు. 24/7 వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేసింది.

నియోజకవర్గంలో రాజన్నదొర చొరవతో..

నాటి డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో సాలూరు నియోజకవర్గంలో వందపడకల ఆస్పత్రి నిర్మాణం ఊపందుకుంది. రూ.17 కోట్లు నాబార్డ్ నిధులతో చేపట్టిన వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి నాటి మంత్రి బొత్స సత్యనారాయణలో కలిసి భూమిపూజ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ ఆస్పత్రి నిర్మాణ పనులు సుమారు 75 శాతానికి పైగా పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రి నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు.

రూ.10 కోట్లతో ఆస్పత్రుల అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మామిడిపల్లి, తోణాం, మక్కువ, శంబర, చల్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొత్త భవనాల నిర్మాణం, ఆధునీకరణ పనులు శరవేగంగా సాగాయి. సుమారు రూ.1.82 కోట్లతో తోణాం పీహెచ్‌సీ భవనం నిర్మించారు. సుమారు రూ.2.42 కోట్లతో మక్కువ పీహెచ్‌సీ భవన నిర్మాణం చేపట్టగా శ్లాబ్ వరకు పనులు పూర్తయ్యాయి. రూ.1.89 కోట్లతో శంబర పీహెచ్‌సీ భవనం, రూ.1.82 కోట్లతో మామిడిపల్లి పీహెచ్‌సీ భవనం, రూ.1.74 కోట్లతో మెంటాడ పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఆయా భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. చల్లపేట పీహెచ్‌సీ భవనం పూర్తి కావడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రారంభించారు. ఆస్పత్రుల అభివృద్ధి, భవన నిర్మాణ పనులపై పీడిక రాజన్నదొర ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించడంతో పాటు పనులు వేగంగా జరిగేలా చూశారు. 2014–19 మధ్య టీడీపీ పాలనకు, 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ పాలనకు, ప్రస్తుత కూటమి పాలన మధ్య తేడాలను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని పలువురు గుర్తుచేసుకుంటున్నారు.



పట్టణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న రాజన్నదొర (ఫైల్)